నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 13 డిసెంబర్ 2024 | NIZAMABAD




నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో నిరవధిక సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

# ఆశ పెట్టి.. హామీలు ఎగ్గొట్టి

- సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను వంచించిన కాంగ్రెస్
- ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ
- ముఖ్యమంత్రి అయ్యాక ముఖం చాటేసిన రేవంత్
- ఏడాది దాటినా మాట నిలబెట్టుకోని వైనం
- మూడు రోజులుగా సమ్మె చేస్తున్నా స్పందన కరువు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు..

నిజామాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్‌రెడ్డి అనేక హామీలు గుప్పించారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కాక దారుణంగా వంచించారు. ఎన్నికల ముందర పీసీసీ చీఫ్‌గా అనేక హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారం చేపట్టాక ఆయా హామీలను ఎగ్గొట్టారు. సీఎం బాధితుల్లో రైతులు, మహిళలే కాదు.. సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు కూడా చేరారు. వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు వారు సమ్మె చేస్తున్నా కనీసం స్పందించడం లేదు. ఓట్ల కోసం ఉద్యోగులు, మహిళలు, రైతులు.. ఇలా సబ్బండ వర్గాలను రేవంత్‌రెడ్డి మోసం చేశారు. రుణమాఫీ చేయకుండా, రైతుబంధు ఇవ్వకుండా రైతులను నట్టేటా ముంచారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలపై అనేక వరాలు కురిపించి అమలు చేయకుండా చేతులెత్తేశారు. ఉద్యోగుల కష్టాలు తీరుస్తామని కల్లబొల్లి మాటలు చెప్పిన కాంగ్రెస్ అధికారం చేపట్టాక చేతులెత్తేసింది. సర్కారు వైఖరిపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

### ప్రభుత్వానికి పట్టింపు లేదు..



ఉద్యోగ భద్రత కల్పిస్తామని రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చారు. ఏడాది పూర్తయినా ఇప్పటికీ ఆయన మాటకు దిక్కులేకుండా పోయింది. డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన చేస్తూనే ఉన్నాం. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. గత నెల 22న తెలంగాణ సమగ్ర వర్క్ ఆర్ట్స్ ఫిజికల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్ఎస్‌యుఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యాశాఖకు మొదటిసారి నోటీసు ఇచ్చారు. 15 రోజుల వ్యవధిలో స్పందన రాకపోవడంతో ఈ నెల 6న మరోసారి సమ్మె నోటీసు ఇచ్చాం. అయినా రేవంత్ సర్కారు మమ్మల్ని కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. అందుకే ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగాం. ఉద్యోగ భద్రత కల్పించే దాకా ఉద్యమాన్ని ఆపేది లేదు.

**- రాజు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, నిజామాబాద్‌జిల్లా**

### మాట ఇచ్చి.. మడమ తిప్పి..

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రేవంత్‌రెడ్డి దారుణంగా మోసగించారు. విద్యాశాఖలో విలీనం చేసి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు 2023లో సమ్మె చేపట్టారు. అప్పట్లో 22 రోజుల పాటు సమ్మె చేశారు. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి గతేడాది సెప్టెంబర్ 13న హన్మకొండలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు హామీలిచ్చారు. తాము అధికారంలోకి రాగానే చాయ్ తాగినంత సమయంలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఏడాది దాటిపోయింది. కానీ ఇచ్చిన హామీ అమలు కాలేదు. మాట నిలబెట్టుకోవాలని ఉద్యోగులు పలుమార్లు విన్నవించారు. అయినా స్పందన కరువవడంతో ఆగ్రహానికి గురైన వారు రేవంత్ వైఖరిపై దుమ్మెత్తి పోస్తూ ఈ నెల 10 నుంచి సమ్మె బాట పట్టారు. వాస్తవానికి గతేడాది అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హయాంలోనే ఎస్ఎస్ఏ ఉద్యోగుల పే స్కేల్ ఫైల్ సిద్ధమైంది. కానీ ఎన్నికలు రావడంతో ఫైల్ మరుగున పడిపోయింది. లేదంటే అప్పుడే తమ సమస్యకు పరిష్కారం లభించి ఉండేదని ఉద్యోగులు వాపోతున్నారు.

### అందరూ రోడ్లపైనే..

సమగ్ర శిక్ష ఉద్యోగులు విద్యాశాఖలో 18 ఏండ్ల నుంచి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న వీరికి వేతనాలు మాత్రం అరకొరగానే ఉన్నాయి. 2006లో రాజీవ్ విద్యామిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థలో కలెక్టర్లు చైర్మన్లుగా ఉన్న త్రీమెన్ కమిటీ ద్వారా రోస్టర్ మెరిట్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఒప్పంద ఉద్యోగులుగా వీరిని ఎంపిక చేశారు. జిల్లాస్థాయిలో ఏపీవో, సిస్టం అనాలసిస్ట్ టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్స్, డీఎల్ఎంటీ, మెసెంజర్లుగా, మండల స్థాయిలో ఎంఐఎస్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఆర్‌సీఎస్ మెసెంజర్స్, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్, పాఠశాల స్థాయిలో పార్ట్‌టైం ఇన్స్ట్రక్టర్స్, కేజీబీవీ యూఆర్ఎస్‌లలో స్పెషల్ ఆఫీసర్స్, పీజీసీ ఆర్టిస్టులు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్, క్రాఫ్ట్ అండ్ కంప్యూటర్ ఇన్స్ట్రక్చర్స్, వాచ్‌మెన్, వంట చేసే సిబ్బంది (కుక్‌లు), స్కావెంజర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖకు అనుబంధంగా కీలక విధులు నిర్వర్తిస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెతో వ్యవస్థ కుంటుపడుతున్నది. మరోవైపు కేజీబీవీలు సైతం మూతపడే పరిస్థితికి వచ్చింది.

### వీరే కీలకం..

సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రభుత్వం అప్పగించిన పనిలో భాగస్వాములవుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా విద్యను బోధిస్తూ వారిలో సృజనాత్మకతను వెలికి తీస్తున్నారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. విద్యార్థులకు దుస్తులు, పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం సరఫరాలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. యూడీఎస్ ప్లస్‌లో డ్రాప్ట్ పిల్లల్ని ఇంపోర్ట్ చేయడం, రాపోట్ చేయడం, ప్రొఫైల్స్ అప్‌డేట్ చేయడం, డీఎస్ఈ, ఎఫ్ఆర్ఎస్ విద్యార్థుల ఆన్‌లైన్ హాజరును చూసుకోవడం, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌కు సంబంధించిన ప్రతి విషయంలో సమగ్రశిక్ష ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తూ విద్యావ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్నారు. ఇతర కార్యక్రమాల్లోనూ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే విధులు నిర్వహిస్తూ అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు అందుతున్నాయి. మహారాష్ట్ర, ఒడిశా, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పేస్కేల్ అమలుచేస్తున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన జీవో నంబర్ 4 ప్రకారం చాలా రాష్ట్రాల్లో సమానపనికి సమాన వేతనం అమలవుతున్నది. కానీ మన రాష్ట్రంలో మాత్రం ఇందుకు భిన్నంగా వేతనాలు ఇస్తున్నారు. విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే కనీసం దహనక్రియల ఖర్చులు కూడా చెల్లించడం లేదు. 61 ఏండ్లు నిండిన తర్వాత ఉద్యోగ విరమణ చేస్తే రిటైర్మెంట్ ప్రయోజనాలు కూడా కల్పించడం లేదు. దీంతో ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేస్తున్నారు.

### పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భారీర్యాలీ



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

శక్కర్‌నగర్, డిసెంబర్ 12 : సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా బోధన్ పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అనిల్ టాకీస్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గౌతంకుమార్ మాట్లాడుతూ.. విద్యావ్యవస్థ సవ్యంగా కొనసాగాలంటే సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. కార్తీక్, జిల్లా నాయకులు కె. సాయినాథ్, ఆకాశ్ కుమార్, రమణి తదితరులు పాల్గొన్నారు.




ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ప్లాట్ యజమాని నగేశ్‌కుమార్, పక్కన బీఆర్ఎస్ నేతలు

# రోడ్డు కాదది.. ప్లాటే

- ఎమ్మెల్సీ కవిత కుటుంబానికి సంబంధం లేదు
- రాజకీయ దురుద్దేశంతో ఆమెను లాగుతున్నారు
- మైనంపల్లి బావమరిది నగేశ్‌కుమార్

కంఠేశ్వర్, డిసెంబర్ 12: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌కేఆర్ అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న స్థలం తన సొంతమని, ఇందులో ఎమ్మెల్సీ కవిత కుటుంబానికి ఏమాత్రం సంబంధం లేదని ప్లాట్ యజమాని, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బావమరిది నగేశ్‌కుమార్ స్పష్టం చేశారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌కేఆర్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే వారు తన ప్లాట్ విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. వివాదం చేస్తున్న స్థలం రహదారి కాదని, అది తన సొంతమని తెలిపారు. సర్వే నం.219లో 235 గజాల ప్లాట్‌ను కొనుక్కుని, 2018లోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని చెప్పారు.

ఆ ప్లాట్‌కు, అపార్ట్‌మెంట్ వాసులకు ఎలాంటి సంబంధం లేదని, కావాలనే రహదారి అని చెబుతూ వివాదం సృష్టించి, దానికి రాజకీయ రంగు పులుముతున్నారని తెలిపారు. తన స్థలాన్ని కబ్జా చేయాలని యత్నిస్తున్నారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు చెప్పారు. కొందరు వ్యక్తులు కావాలని దురుద్దేశంతో రాజకీయ రంగు పులమాలని చూస్తున్నారని, అందులో భాగంగానే ఎమ్మెల్సీ కవిత, ఆమె మామ రాంకిషన్‌రావు గురించి ప్రస్తావిస్తున్నారన్నారు. వాస్తవానికి ఈ స్థలంతో వారికి ఎలాంటి సంబంధం లేదని నగేశ్‌కుమార్ స్పష్టం చేశారు. తన వద్ద స్థలానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని, మున్సిపల్ కార్పొరేషన్‌కు ట్యాక్స్ సైతం చెల్లిస్తున్నానని చెప్పారు. ఎవరు ఎప్పుడు అడిగినా అన్ని వివరాలు ఇవ్వడానికి సిద్ధమన్నారు. స్థల వివాదానికి ఎమ్మెల్సీ కవిత, రాంకిషన్‌రావుకు ఎలాంటి సంబంధం లేకపోయినా రాజకీయ దురుద్దేశంతో కొందరు వారి పేర్లు చెబుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత తెలంగాణ శంకర్ అన్నారు. మరోసారి తమ నాయకుల పేర్లు ప్రస్తావిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

గాండ్లపేట శివారులోని పెద్దవాగు నుంచి అర్ధరాత్రి ఇసుక తరలింపు వ్యవహారం జోరుగా సాగుతున్నది. రాత్రి 10 దాటిన తర్వాత జేసీబీలు, ట్రాక్టర్లు వాగులోకి చొరబడుతున్నాయి. తెల్లవారుజాము వరకూ వందల ట్రిప్పుల ఇసుకను తరలించుకు పోతున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జరుగుతున్న ఈ అక్రమ దందాకు రెవెన్యూ, పోలీసు శాఖలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా క్షేత్ర

### కదలని అధికారులు..

స్థాయి నుంచి డివిజన్, జిల్లా స్థాయి వరకూ అందరికీ ముడుపులు ముడుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలపై ఈ నెల 10న 'పెద్దవాగును తవ్వేస్తున్నారు' శీర్షికన నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనం ప్రచురించింది. అయినప్పటికీ అధికారులు స్పందించక పోవడం.. ఇసుకాసురులతో పెనవేసుకున్న బంధాన్ని తేటతెల్లం చేస్తున్నది.

### అందరూ కూడబలుక్కుని..

వాస్తవానికి గాండ్లపేట శివారులోని పెద్దవాగులోకి వెళ్తే అక్కడేం జరుగుతుందో కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. మొరంతో రోడ్డు వేసి, పొక్లెయిన్‌తో ఇసుకను తోడిన ఆనవాళ్లు కనబడుతూనే ఉన్నాయి. అయినా రెవెన్యూ, పోలీసు అధికారులు మాత్రం మొద్దునిద్ర వీడడం లేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వెళ్లడం లేదు. నిశీధిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై అధికారుల వివరణ అడిగితే.. ఆ విషయం అక్రమార్కులకు చేరిపోవడాన్ని బట్టి అందరూ కూడబలుక్కున్నట్లే అర్థమవుతున్నది. రూ.లక్షల్లో లంచాలు తీసుకుంటున్న రెండు ప్రధాన శాఖల అధికారులు దగ్గరుండి ఇసుకాసురులకు సహకరిస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది. బుధవారం రాత్రి సైతం నాలుగు గంటలకు పైగా అక్రమార్కులు ఇసుక తవ్వకాలకు పాల్పడ్డారు. ఆ తర్వాత అధికారుల సూచన మేరకు ఆపేసినట్లు తెలిసింది.

*సమయం అర్ధరాత్రి 12.20 గంటలు.. స్థలం మోర్తాడ్ బస్టాండ్ ఎదురుగా ఉన్న రాయల్ హోటల్. జాతీయ రహదారిపై రెండు పోలీసు వాహనాలు గస్తీ కాస్తున్నాయి. వాటి ముందర నుంచే ఇసుక ట్రాక్టర్లు జోరుగా పరుగులు పెడుతున్నాయి. నిశీధిలో తమ కళ్ల ముందే సాగుతున్న ఇసుక దందాను పోలీసులు కళ్లప్పగించి చూస్తున్నారు. ఒక విధంగా సహజ సంపద దోపిడీకి కాపలా కాస్తున్నారు!. అధికార పార్టీ నేతలు ఇసుకను ఎలా కొల్లగొడుతున్నారో, అధికారులు, పోలీసులు వారికి ఎలా వత్తాసు పలుకుతున్నారో చెప్పేందుకు చక్కటి నిదర్శనమే ఈ ఉదంతం.*

పెద్దవాగు నుంచి ఇసుక తరలింపునకు అక్రమార్కులు నోట్ల కట్టలను ఎర వేస్తున్నారు. గ్రామ కమిటీలు, అధికారులకు రూ.లక్షలు ముట్టజెప్పి సహజ సంపదను దోచుకుంటున్నారు. పెద్దవాగులో ఇసుక తవ్వుకోవడానికి గాండ్లపేట గ్రామకమిటీకి రూ.18 లక్షలు చెల్లించారు. మరోవైపు, మోర్తాడ్ శివారులో ఇసుక తవ్వినందుకు గాను మోర్తాడ్ వీడీసీ సభ్యులు రూ.5 లక్షల జరిమానా విధించినా బుద్ధి మార్చుకోలేదు. పైగా మరింత రెచ్చి

### రూ.లక్షల్లో ముడుపులు..

పోయి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఇక, అధికారులకు సైతం పెద్ద మొత్తంలో ముట్టజెబుతున్నారు. మండల స్థాయి అధికారులతో పాటు సర్కిల్, డివిజన్ స్థాయి అధికారులకూ రూ.లక్షల కొద్దీ డబ్బులు వెదజల్లుతున్నారని తెలిసింది. అందుకే ఆయా శాఖల అధికారులు ఇసుక దందా వైపు కన్నెత్తి చూడడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గాండ్లపేట్ నుంచి రాత్రి సమయంలో ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

- పెద్దవాగులో చీకటి దొంగలు
- వాగులో రోడ్డు వేసుకుని మరీ..
- అర్ధరాత్రిలో అక్రమ దందా
- జేసీబీతో తవ్వకాలు.. ట్రాక్టర్లతో తరలింపు
- అధికార పార్టీ నేతల బరితెగింపు
- తహసీల్ ఆఫీసుకు కూతవేటు దూరంలో డంపులు
- దోపిడీకి అధికారులు, పోలీసుల సహకారం?

మోర్తాడ్, డిసెంబర్ 12 : బాల్కొండ నియోజకవర్గంలో ఇసుక దోపిడీ ఆగడం లేదు. యంత్రాంగాన్ని గుప్పిట పట్టిన అధికార పార్టీ నేతలు ఏమాత్రం తొణకడం లేదు. ఎవరొచ్చినా ఏం చేస్తారనే ధీమాతో రెచ్చిపోతున్నారు. నిశీధిలో యథేచ్ఛగా ఇసుక కొల్లగొడుతున్నారు. గ్రామ కమిటీలకు, అధికారులకు లక్షల రూపాయలను ఎరగా వేసి సహజ సంపదను దోచుకుంటున్నారు. అక్రమార్కులకు కళ్లెం వేయాల్సిన పోలీసులు, ఇసుక దోపిడీని అడ్డుకోవాల్సిన అధికారులు కిమ్మనడం లేదు. పైగా ఇసుకాసురులకు వంత పాడుతుండడం విస్మయానికి గురి చేస్తున్నది. కండ్ల ముందే ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నా పోలీసులు ఆపడం లేదు సరికదా వాటికి కాపలా కాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు, పెద్దవాగులో రోడ్డు వేసి జేసీబీతో ఇసుక తరలిస్తుంటే రెవెన్యూ అధికారులు కండ్లు మూసుకున్నారు. ఇదేమిటి సారు అని ఎవరైనా అడిగితే 'అలాగా. మా దృష్టికి రాలేదు. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని' పాత పాటే పాడుతున్నారు.

నమస్తే తెలంగాణ ఫోకస్

# ఆగని ఇసుక దోపిడీ

మోర్తాడ్ శివారులోని జాతీయరహదారి పక్కనే లెక్కలేనన్ని ఇసుక డంప్‌లు ఉన్నా కనిపించడం లేదు. పైగా తహసీల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఇసుకను డంప్ చేస్తున్నా రెవెన్యూ అధికారుల కండ్లకు కనబడడం లేదు. గాండ్లపేట్ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ఇక్కడ డంప్ చేసి, లారీల్లో పట్టణాలకు తరలిస్తున్నారు. రోజుల తరబడి ఇక్కడే ఉంటున్నా వీటి గురించి ఎవరూ పట్టించుకోరు. అధికార

### తహసీల్ ఆఫీస్‌కు సమీపంలోనే..

పార్టీకి చెందిన నాయకులే ఇసుక దోపిడీకి పాల్పడుతుండడం, అధికారులకు భారీగా ముడుపులు చెల్లించడమే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. బాల్కొండ నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ దందా జరుగుతున్నా జిల్లా స్థాయి అధికారులు సైతం కిమ్మనక పోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఇసుక అక్రమ రవాణా విషయంలో ఆందోళనలు చేసే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయంటే అధికారులు ఎంత ఉదాసీనంగా ప్రవర్తిస్తున్నారో స్పష్టమవుతున్నది.



మోర్తాడ్ శివారులో జాతీయరహదారి పక్కన ఉన్న ఇసుక డంప్‌లు

# విద్యార్థిని చితకబాదిన టీచర్

- చేతికి గాయం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

వినాయక్‌నగర్, డిసెంబర్ 12 : తలనొప్పితో ఇంటికి వెళ్లిన పదోతరగతి విద్యార్థిని క్లాస్ టీచర్ చితకబాదిన ఘటన జిల్లాకేంద్రంలోని దుబ్బ జడ్పీహెచ్ఎస్‌లో చోటు చేసుకున్నది. ఈ విషయమై విద్యార్థిని జి. అశ్విత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ కూతురు ఈ నెల 5వ తేదీన తలనొప్పితో పాఠశాల నుంచి ఇంటికి వచ్చిందని తెలిపారు. మరుసటి రోజు స్కూల్‌కు వెళ్లగా.. క్లాస్ టీచర్ కల్పన ఇష్టం వచ్చిన బూతులు తిడుతూ కొట్టిందని వాపోయారు. ఎవరితో సినిమాకు వెళ్లావని తిడుతూ కొట్టడంతో తమ కూతురి భుజం ఉబ్బి, పైకి లేవడం లేదని తెలిపారు. పదోతరగతి పరీక్షలు ఎలా రాస్తావో చూస్తానంటూ బెదిరించిందని చెప్పారు. టీచర్ కల్పనపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిని తల్లి శైలజ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఫిర్యాదు చేసి నాలుగురోజులు అయ్యిందని, పిలిమినరీ సమయం 14 రోజులు ఉంటుందని, విచారణ చేపట్టిన అనంతరం కేసు నమోదు చేస్తామని ఎస్సై చెప్పారని విద్యార్థిని తండ్రి సురేశ్ తెలిపారు. సదరు టీచర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థిని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# వివాదాల పరిష్కారానికి ఉత్తమ వేదిక 'లోక్‌అదాలత్'

- జిల్లా ప్రధానన్యాయమూర్తి సునీత కుంచాల
- రేపు జాతీయ లోక్‌అదాలత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సునీత కుంచాల

వినాయక్‌నగర్, డిసెంబర్ 12 : కక్షిదారుల మధ్య నెలకొన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్ ఉత్తమ పరిష్కార వేదిక అని జిల్లా ప్రధానన్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కోర్టు ప్రాంగణంతోపాటు ఆర్మూర్, బోధన్ కోర్టుల ఆవరణలో ఈ నెల 14న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కోర్టులో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మొత్తం 13 లోక్‌అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడానికి పౌరసమాజం సహాయ సహకారాలు అందించాలని కోరారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ దావాలు రాజీ పద్ధతిలో ఇరుపక్షాలు పరిష్కరించుకోవడానికి చట్టం అనుమతినిస్తున్నదని తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల కేసులు, గృహహింస, మెయింటెనెన్స్ కేసులు రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలకు ఆర్థిక లబ్ధి చేకూరడంతోపాటు సమయం ఆదా అవుతుందని తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకున్న అన్ని రకాల కేసులకు శాశ్వత చట్టబద్ధత కల్పిస్తూ అవార్డులను జారీ చేస్తామని, ఇవి హైకోర్టుల్లో అప్పీలుకు వీలు లేనివని స్పష్టంచేశారు.